క్లుప్తంగా

జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్‌గా శ్రీలలిత



కలెక్టర్ కృతికా శుక్లాతో సమాఖ్య చెర్మన్, ప్రతినిధులు

సామర్లకోట: జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్‌గా ఎంపీడీఓ డి.శ్రీలలిత ఎన్నికయ్యారు. కో చైర్మన్‌గా కరప ఎంపీడీఓ స్వప్న, ప్రధాన కార్యదర్శిగా దారపురెడ్డి తాతాజీరాజు, వైస్ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా ఇ.రాంజీ ప్రసాద్, ఆర్గనైజింగ్ సహాయ కార్యదర్శిగా మహబూబ్ బాషా ఎన్నికైనట్టు శ్రీలలిత తెలిపారు. ఈ మేరకు శనివారం సంఘ ప్రతినిధులు కలెక్టర్ కృతికా శుక్లాను కలిశారు. తమ సమాఖ్య 130 వివిధ సంఘాలతో కూడినదని, దీనిలో 29 గుర్తింపు సంఘాలు ఉన్నాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

సామర్లకోట: పోషణ ఆహార మాసోత్సవాలల్లో భాగంగా పెద్దాపురం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం బలుసులపేటలో పోషకాహారంపై 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబుఅవగాహన కల్పించారు. అనంతరం బలుసులపేటలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక సీహెచ్‌సీలో బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజరు జ్యోతి ఆరోగ్యంపై జాగ్రత్తలను వివరించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవి

పిఠాపురం/పెద్దాపురం: పాఠశాలలు, కళాశాలల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, జూనియర్ సివిల్ జడ్జిలు ఎం.సుధారాణి, బుల్లెమ్మ వేర్వేరుగా జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో విద్యార్థులను హెచ్చరించారు. పిఠాపురం పాలిటెక్నిక్ కళాశాల, సూర్యరాయ డిగ్రీ కళాశాల, పెద్దాపురం మండలం దివిలిలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో వారు శనివారం సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో సంబంధిత విద్యా సంస్థల యాజమాన్యాలు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ 23.90 కోట్లతో మంచినీటి పథకం



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

- ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు

పిఠాపురం: పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రూ.23.9 కోట్లతో మంచినీటి పథకం స్థాయిని పెంచేందుకు, రూ.9.20 కోట్లతో చేపట్టే అమృత పథకం పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇంత అత్యవసరగా మంచినీటి పథకంపై సమావేశం పెట్టాల్సిన అవసరం ఏమి వచ్చిందని కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరి ప్రశ్నించగా ఏఈ స్వాతి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి అవసరాలకు సరిపడా ట్యాంకు నిర్మాణం, పైపులైన్ల నిర్మాణాలకు 0.09 శాతం రూ.33 లక్షలు డీపీఆర్ కింద మున్సిపాలిటీ చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.33 కోట్లు నిధులు విడుదల అవుతాయని వివరించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ లోపించిందని కౌన్సిలర్లు ధ్వజమెత్తగా ఇన్‌చార్జి కమిషనర్ డీఈ భవానీశంకర్ బదులిస్తూ సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని గణపతి హోమం



గణపతి పూజలు చేసిన దొరబాబు

సామర్లకోట: స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం హౌసింగ్‌బోర్డు చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ప్రజలు సుఖంగా ఉండాలని పూజలు చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి శ్రీలలిత, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ డ్రయ్యర్ వినియోగంపై అవగాహన

కొత్తపల్లి: సోలార్ డ్రైయ్యర్ మత్స్యకార మహిళలకు ఎంతో ఉపయోగకరమని మత్స్యకార మహిళా సమాఖ్య కో ఆర్డినేటర్ ఎస్.శ్రీధర్ అన్నారు. మండలంలోని ఉప్పాడలోని మత్స్యకార మహిళా సమాఖ్య కార్యాలయంలో మత్స్యకార మహిళలకు శనివారం ఎండు చేపల తయారీకి వినియోగించే సోలార్ డ్రైయర్‌పై అవగాహన కల్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొదటిసారిగా ఉప్పాడ మత్స్యకార మహిళా సమాఖ్యలో ఈ డ్రైయర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.



సోలార్ డ్రయ్యర్ యంత్రంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లబ్ధిదారులలో అవగాహన పెంచాలి

సామర్లకోట: జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారుల్లో అవగాహన పెంచాలని హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్ అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ఈ నెలాఖరు నాటికి ఈటీసీ లే అవుట్‌లో పనులు ప్రారంభించకపోతే వారికి మరో ప్రదేశంలో స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు చేసుకునే వారికి ఆ స్థలాలను కేటాయిస్తామని చెప్పారు. ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఇస్తూ ఉండగా హౌసింగ్ అధికారులు బ్యాంకుల నుంచి రూ.35వేలు రుణం ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్న విషయాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

పెద్దాపురం: జగ్గంపేట మండలం సీతారాంపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలంటూ స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్రల ఆధ్వర్యంలో మార్చురీ ఎదుట రోడ్డుపై బైఠాయించి రైతు కూలీలైన సూరిబాబు, నాగు, నాగరాజుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చల అనంతరం విద్యుత్ డీఈ హామీతో ఆందోళన విరమించారు.

బాధిత కుటుంబానికి బీమా అందజేత

కొత్తపల్లి: మండలంలో ఇటీవల మృతిచెందిన కొండెవరం గ్రామానికి చెందిన వేమగిరి మోషే కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. వైఎస్సార్ బీమా రూ.5 లక్షలను బాధిత కుటుంబానికి అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, మారిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొంపా రాజు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అండగా నిలిచారు. వినాయక చవితి రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు తీవ్ర గాయాలతో మృతి చెందాడు. దీంతో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు చొరవతో మంజూరైన వైఎస్సార్ బీమా రూ.ఐదు లక్షల చెక్కు మంజూరుకు ముందుగా నామినీ గొంప ప్రభాకర్‌కి రూ.పది వేల ఆర్థిక సాయం అందజేశారు.

మున్సిపల్ డీఈగా అనంతలక్ష్మి

సామర్లకోట: స్థానిక మున్సిపల్ డీఈగా అనంతలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పబ్లిక్ హెల్త్ డీఈ హుస్సేన్ ఇన్‌చార్జి డీఈగా బాధ్యతలు నిర్వర్తించగా ఆయనను పబ్లిక్ హెల్త్ విభాగానికి పంపారు. కార్పొషన్‌లో ఏఈగా పని చేస్తున్న అనంతలక్ష్మికి పదోన్నతి డీఈగా సామర్లకోటకు బదిలీ చేయడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త వెంకటనరసింహారావు
- చెందుర్తిలో పంట పొలాల పరిశీలన



చెందుర్తిలో తెగుళ్లు సోకిన పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వెంకటనరసింహారావు

పిఠాపురం: ప్రస్తుత ఖరీఫ్‌లో పంటలకు తెగుళ్ల సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త చల్లా వెంకటనరసింహారావు రైతులకు సూచించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఆయన శనివారం పర్యటించారు. వరి, పత్తి, మిరప పంటలను పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు ఆకునల్లి, ఆకుముడత, కాండం తొలుచు పురుగు, ఎండాకు తెగులు, పాము పొడ తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే పలు చోట్ల పంటలకు ఆయా తెగుళ్ల ఆశించినట్టు గుర్తించామన్నారు. ఆకునల్లి తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి 3 గ్రాములు లేదా డైనోఫాల్ 5 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పాము పొడ తెగులు నివారణకు ప్రోఫికోనాజోల్ 1 మిల్లీ లీటరు లేదా హెక్సికోనోజోల్ 2 మిల్లీ లీటరు, లేదా టెబ్యునోనాజోల్ 2 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ప్రత్తిలో రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్రోప్రిడ్ 0.4 మిల్లీ లీటర్లు లేదా ఎసిటామోప్రైడ్ 0.2 గ్రాములు థయామిథాక్సిమ్ 0.2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. గులాబీ పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిక్ 2 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పూత, పిందె రాలకుండా ప్లానోఫిక్స్ 10 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో గొల్లప్రోలు మండల ఏఓ కె.సత్యనారాయణ, సర్పంచ్ అల్లి నూకరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

తీరంలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



కోనపాపపేట తీరప్రాంతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కొత్తపల్లి: తీరంలోని ప్రమాదకర ప్రదేశాల్లో శనివారం పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొనపాపపేట నుంచి ఉప్పాడ వరకూ తీర ప్రాంతం వెంబడి పలు ప్రాంతాల్లో ఎస్సై స్వామినియుడు ఆధ్వర్యంలో పోలీసులు హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అతివేగం ప్రమాదకరం, డేంజర్ ఏరియా అని రాళ్ల, ఫ్లెక్సీలపై రాయించారు. గతేడాది వినాయక నిమజ్జనంలో అమీనాబాద్ తీరప్రాంతంలో ప్రమాదశాత్తూ ముగ్గురు యువకులు మృతి చెందిన విషయం విదితమే. ఉప్పాడ తీరప్రాంతంలో కూడా పలువురు మృతి చెందారు. ఈ ఏడాది ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి, ఆ ప్రదేశాలకు పర్యాటకులు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. సెలవు రోజుల్లో పర్యాటకుల సంఖ్య అధికంగా ఉండడంతో పోలీస్ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా సాగేలా భక్తులు, పర్యాటకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నెలాఖరుకు గృహ ప్రవేశాలు పూర్తి కావాలి

సామర్లకోట: ఈ నెలాఖరు నాటికి టిడ్కో గృహ ప్రవేశాలు పూర్తి కావాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. శనివారం మెప్మా కార్యాలయంలో ఆర్పీలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు మరణించి ఉంటే వారి వారసులకు ఇళ్లు కేటాయింపులో వేగవంతమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. బ్యాంకు లింకేజీతో పాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఆర్పీలపై ఉందన్నారు. ఇప్పటికే టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద మున్సిపాలిటీ నుంచి మౌలిక సదుపాయాలు కల్పించినట్టు తెలిపారు. మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, సచివాలయ కార్యదర్శుల సంఘ నాయకులు జోగారావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మెప్మా ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు